

# తెరపు

జి. చిరంజీవి

'ఆఫీసుకి టైమైపోతూంది. ఇంకా ఎప్పుడు నువ్వు కాఫీ తెచ్చేది' అని విసుక్కుంటున్నాడతడు ఒకవేపు.

పిల్లలు గీపెట్టి ఏడుస్తున్నారు మరో వేపు.

'ఛీ! ఏం మనుషులో. ఆ పిల్లల్ని కాస్త సముదాయించ కూడదూ. పైగా ఈ దబాయింపులు. మీకేం ఎన్నయినా అంటారు. అటు ఈ పిల్లలతో పడలేక, ఇటు మీతో వేగలేక మధ్యలో సతమత మయ్యేదినేను'— ఈసడింపుగా ఆమెమాటలు. అతను పిల్లల్ని సముదాయించలేదు. వాళ్ళు ఏడవటం మానలేరు. కొద్ది నిముషాల తరువాత—

'ఇదిగోండి కాఫీ' అంటూ ఆమె.

'తెల్లే తెల్లే కాఫీ తీసుకురావద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు—' అతని గద్దింపు.

'ఆ మాత్రం చల్లార్చుకోవచ్చు. అవతల వాకు వసుంది' కాఫీగ్లాసును నేలకేసి కొట్టిన చప్పుడు.

'ఆఁ...మనిషికి మరీ అంతకోపం పనికిరాదు. గ్లాసుదు కాఫీని నేలపాలు చేశారు. ఎందుకు నన్నిలా చంపుతారు ?'— ఏడుపుతో కూడిన ఆమె మాటలు.

'సోర్మ్మయ్. ఆట్టే వాగావంటే...'

'కొడతారు. కొత్తేం కాదుగా. కొట్టి చంపెయ్యండి; ఒక్కసారిగా పీడ వదిలి పోతుంది. పెళ్ళామంటే మీ కింద బానిసేగా'—ఆమె ముక్కు చీదేసింది. అతను చర చరా వెళ్ళిపోయాడు — వారంరోజుల క్రితం ప్రక్క వాటాలోకి కొత్తగా వచ్చి చేరిన దంపతులు రోజూ ఇలా ఘర్షణ పడటం అది వినటం పార్వతికి అలవాటై పోయింది.

బొట్టు సవరించుకుని, అద్దంలో తన ప్రతిబింబాన్నొకసారి తృప్తిగా చూసుకుని గదిలోంచి ఇవతలికొచ్చింది పార్వతి.

తమ్ముడెదురైనాడు.

'అక్కయ్యా ! ఈ రోజు మీకు 'పేడే' కదూ. వచ్చేటప్పుడు మరచిపోకుండా పైలెట్‌పెన్ను పట్టుకురా అక్కయ్యా.'

'అలాగే లేరా' అని వసారాలో కొచ్చింది పార్వతి.

'అమ్మా ! నా పంచెల సంగతి మర్చిపోవుకదూ' పడక్కుర్చీలో వాలి చుట్ట కాల్చుకుంటూ అన్నాడు తండ్రి.

'లేదు నాన్నా. రెండు మల్లుపంచెలు తెమ్మన్నారు కదూ' అని అంతలో పక్క గదిలోంచి 'అమ్మా పార్వతీ' అన్న తల్లి హీనస్వరం వినిపించడంతో అక్కడికి వెళ్ళింది పార్వతి.

మంచంలో మూలుగుతూ పడివున్న తల్లిని సమీపించింది.

'అబ్బా ! ఈ బాధ భరించలేకుండా వున్నాను తల్లీ. మరీ మూడ్రోజులనుంచి, ఎక్కువైంది. ఈ రోజన్నా ఆ డాక్టరు రాసిచ్చిన మందు తీసుకురామ్మా. అన్నట్టు ఈరోజు నీకు జీతంకదూ ! అలాగే రెండు ఆపిల్‌పళ్ళుకూడ పట్రా తల్లీ.'

'అలాగేనమ్మా. ఈరోజు తప్పకుండా మందు తీసుకు వస్తాను. ఇదుగో డాక్టరు రాసిచ్చిన చీటికూడ తీసుకు వెడుతున్నాను. ఆఫీసుకు వేళైంది వస్తానమ్మా' అని చెప్పి ఇంటినుండి బయట పడింది పార్వతి.

* * *

పాతికేళ్ళు నిండినా పార్వతి వివాహం చేసుకోలేదు. మధ్యతరగతి జీవితాల్లో

[illegible] అన్నది కమల.

...మైంది కాదనే సంగతి ఆమె ఏనాడో గ్రహించింది. తన అక్క కాపురాన్నీ, మరి కొందరి సంసారాలనూ చూచి నేర్చుకున్న పాఠం అది.

పార్వతి తండ్రి పరంధామయ్య బడి పంతులు ఉద్యోగం చేసి రిటైరుకాగా వచ్చిన ప్రావిడెంటుఫండుతో ఎలాగో పెద్ద కూతురుపెళ్ళి అయిందనిపించేడు. అప్పుడు పార్వతి స్కూలుఫైనల్ చదువుతోంది. పెళ్ళిచేసుకోవాలనే తలంపే అప్పట్లో ఆమెకు కలగలేదు. అసలా ఆలోచనకు అవకాశమే లేకపోయింది. ఇంట్లో అమ్మా, నాన్నా, తమ్ముడూ—ఈ ముగ్గురికీ తనే ఆధారం. అందుకే తను వుద్యోగం చేస్తానన్నప్పుడు ఆడది వుద్యోగం చెయ్యడమన్నది తమ ఇంటావంటా ఏనాడు లేకపోయినా వాళ్ళు కిక్కురు మనలేదు.

తను అవివాహితగా వున్నాననే దిగులూ, లోటూ ఏనాడు పార్వతిని బాధించలేదు. ఒకరిమీద ఆధారపడకుండా ఆర్జిస్తూ తనవారిని ఆదుకోగలుగుతున్నాననే ఆత్మ సంతృప్తితో రోజులు మామూలుగానే గడచిపోతున్నాయి పార్వతికి.

* * *

నాలుగున్నరకే ఫైళ్ళు కట్టేసి ఆఫీసు గడియారం వేపు చూస్తూ కూర్చుంది పార్వతి. ఆ సాయంత్రం తను కొనవలసిన వన్నీ ఒకసారి పునశ్చరణ చేసుకుంది—నాన్నకి రెండు పంచెలు, తమ్ముడికి పేనా, తన కొకచీర. అన్నిటి కన్నా ముఖ్యం అమ్మమందు. ఆ తరువాత యాపిల్‌పళ్ళు. అన్నట్టు ఈసారైనా పాలకోవా తీసుకు వెళ్ళాలి. అదంటే తమ్ముడికి చాలా ఇష్టం......

అయిదు కావటానికి ఇంకా అయిదు నిముషాలుండగానే సీటులోంచి లేచింది పార్వతి. హేండుబేగు తెరిచి పే పాకెట్టు వొకసారి తృప్తిగా చూచుకుంది.

ఆఫీసు గేటు దాటుతుండగనే 'నీకోసమే వస్తున్నాను పార్వతి,' అంటూ ఎదురైంది కమల హడావిడిగా పరుగెత్తుకొచ్చినట్టు రొప్పుతోంది. చిరునవ్వుతో పలకరించి ఆప్యాయంగా కమల భుజంమీద చేయివేసింది పార్వతి. ఇద్దరూ కొన్ని గజాలు నడిచారు. ప్రశాంతంగా వూపిరి పీల్చుకుని వదిలింతరువాత అన్నది కమల.

'నీతో ఒక ముఖ్యమైన పని వుండి వచ్చాను పార్వతి. ఈ సమయంలో స్నేహితురాలిగా నువ్వు తప్ప నాకు సహాయపడగల వాళ్ళెవరూ లేరు. చాలా కాలం తరువాత మా అన్నయ్యకు వుద్యోగం దొరికింది. రెండొందలు డిపాజిట్టు కడితే అప్పాయింటుమెంటు ఆర్డరు చేతికిస్తారట. రేపే ఆఖరి రోజు. రేపట్లోపల ఆ డబ్బు కట్టకపోతే ఇన్నాళ్ళకి అంది వచ్చిన ఆ వుద్యోగావకాశం కాస్తా చెయ్యి జారిపోతుంది. నాకీ సహాయం చేసి పెట్టావంటే అన్నయ్యా, నేనూ నీమేలెన్నటికీ మరిచి పోము.' అని ఆశగా పార్వతి కళ్ళలోకి చూచింది కమల.

పార్వతికి వెంటనే ఏమని సమాధానం చెప్పాలో తోచలేదు. నేలను చూస్తూ మెల్లగా నడుస్తోంది. ఇంట్లో తన కోసం ఆశతో ఎదురు చూసే నాన్నా, తమ్ముడు, రోగంతో మంచాన పడి బాధగా మూలిగే అమ్మ—డిపాజిట్టు కట్టలేక చేతికందిన వుద్యోగాన్ని జారవిడుచుకుని నిరాశగా నిట్టూర్చే కమల అన్నయ్యా—ఈ విభిన్న దృశ్యాలు ఆమె కళ్ళముందు మెదిలి కలవర పెట్టినవి. ఆత్మీయత— స్నేహం; ఈ రెంటికి మధ్య జరిగిన సంఘర్షణతో నలిగి అలిసిపోయిన వానిలా ముఖం పైకెత్తింది పార్వతి. న్యాయాధికారి తీర్పు కోసం వేచివున్న ముద్దాయిలాగ నిరాశ, ఆతృత, దైన్యం ముప్పిరి గొనగా తనవేపే చూస్తున్న కమల ముఖం కనిపించింది. ఒకసారి గుండెలనిండా తృప్తిగా గాలిని పీల్చుకుని వదిలింది పార్వతి. చిన్నగా నవ్వి కమల భుజంమీద చెయి వేసింది. హేండు బెగుతెరిచి 'ఇదుగో కమలా, ఇందులో రెండు వందలుంది. తీసుకెళ్ళి మీ అన్నకియ్యి. వుద్యోగం ముఖ్యం.' అని తన పే పాకెట్టు కమల చేతికిచ్చింది. సంతోషంతో వుప్పొంగి పోయింది కమల ముఖం.

'నీ కెలా కృతజ్ఞత చెప్పాలో తెలీటం లేదు పార్వతి. నీ మేలు జన్మలో మరిచి పోను. పెద్దన్నకు ఉత్తరంకూడా వ్రాసాము డబ్బు పంపమని. కాని ఎంచేతో సకాలంలో పంపలేక పోయాడు. ఆ పైకం అందిన వెంటనే నీ డబ్బు నీ కిచ్చేస్తాను. వస్తాను, అన్నయ్య ఎదురు చూస్తుంటాడు.' అని ఆనందంగా అడుగులేస్తూ వెళ్ళింది కమల.

[illegible] పార్వతి.

* * *

వట్టి చేతులతో వచ్చిన అక్కను చూడగానే తెల్లబోయి ముఖం మాడ్చుకున్నాడు తమ్ముడు. మౌనంగా తన గదిలోకి వెళ్లబోతున్న పార్వతి 'ఏమమ్మా! ఆఫీసులో ఇవాళ జీతాలివ్వలేదా?' అన్న తండ్రి ప్రశ్న విని వెనక్కి తిరిగింది. ప్రశ్నార్థకంగా ఆమెవేపు చూస్తున్నాడు పరంధామయ్య. జరిగిన సంగతిని క్లుప్తంగా వివరించింది. తను చేసిన పనికి హర్షిస్తాడనుకున్న తండ్రి కనీసం ఆమోదంకూడా తెలుపకుండా ముఖం తిప్పుకుని చరచరా బయటకి వెళ్ళిపోవడాన్ని చూచి చకితురాలైంది పార్వతి. బట్టలు మార్చుకుని తల్లి గదిలోకి వెళ్ళింది. మంచంలో ఎప్పటిలాగే ఆవిడ మూలుగుతూ పడుకుని వుంది.

'ఈ రోజు మందు తీసుకురాలేక పోయానమ్మా' అన్నది పార్వతి బాధగా, ఫ్లాస్కులోని జావను గ్లాసులోకి వంచుతూ.

'విన్నాను లేమ్మా, ఎవరో స్నేహితురాల్ని ఆదుకున్నావటగా, సంపాదించే దానివి నీకా మాత్రం హక్కు లేకపోతే ఎట్లా. మా బాధలు మేం పడతాం. అవెప్పుడూ వుండేవేగా' అని అటు వేపు తిరిగి పడుకుంది ఆమె. పార్వతి మనస్సు చివుక్కు మంది. మొదటి సారిగా తల్లి నోటి వెంబడి వచ్చిన ఆ నిష్టుర వాక్యాలు ములుకుల్లా తగిలినయ్.

'ఇదిగోమ్మా జావ' అన్నది గ్లాసును చేతిలోకి తీసుకుని పార్వతి.

రోజూ ఏడింటికే 'అక్కయ్యా అన్నం వడ్డించు' అనే తమ్ముడు ఎనిమిదయినా ఇంకా తలవంచుకుని ఏదో చదువుకుంటున్నాడు. తనే పిలిచి అన్నం వడ్డించింది. రోజూ కులాసాగా వాడి స్కూలు కబుర్లు చెబుతూ, మధ్య మధ్య తన ఆఫీసు విశేషాలను అడిగి తెలుసుకుంటూ సరదాగా భోంచేసే తమ్ముడు, ఇవ్వాళ మౌనంగా తలవంచుకుని తిని పోవటం పార్వతికి విడ్డూరంగా తోచింది.

తొమ్మిది గంటలవుతూండగా పరంధామయ్యగారు ఉసూరు మంటూ వచ్చి వసారాలోని పడక్కుర్చీలో వాలిపోయారు.

'వంట చల్లారిపోతుంది భోంచేద్దాం

లేండి నాన్నా' అని పిలిచింది పార్వతి. ఆయనొకసారి కళ్ళు తెరచి, నిరసనగా కూతురి వేపు చూచి మళ్ళీ కళ్ళు మూసుకున్నారు, పలక్కుండా. పార్వతికి తల తిరిగి పోయింది. దుఃఖాన్ని ఆపుకోలేక తన గదిలో కొచ్చి మంచంమీద వాలిపోయి కళ్ళు మూసుకుంది.

'ఆడది సంపాదిస్తే ఇంతే' ఛెళ్ళున తన నెవరో కొరడాతో కొట్టినట్లైంది పార్వతికి, అవతల గదిలో మూల్గుల మధ్య తమ్ముడితో తల్లి అంటున్న మాటలు పిడుగుల్లా వినబడినయ్ పార్వతికి. ప్రక్క వాటాలోని గోడ గడియారం పదిగంటలు కొట్టింది.

'ఇదిగో, ఇంకా కోపం పోలేదా నామీద? నీకోసం కొత్త కోక తెచ్చాను చూడవూ' అంటున్నాడతను.

'......'

'నాతో పలకవన్నమాట. ఉండు అయితే నీవని చెపుతాను' కితకితలు పెట్టినట్లు ఆమె కిలకిల నవ్వులు.

'అబ్బ చాలించండి. మరీను ఏమిటది చిన్నపిల్లాడిలా. పక్కవాటాలో వాళ్ళు ఇంకా మేల్కొనే వున్నారు' చిరుకోపం నటిస్తూ ఆమె.

'అయితే ఇలావచ్చి పడుకోమరి' పక్క వాటాలో లైటారి పోయింది. అంతసేపు తనగదిలో మంచంమీద వెల్లకిలా పడుకుని

# తెరలు


అర్థంలేకుండా వెలిగే లైటుకేసి చూస్తూ ప్రక్కవాటాలో జరిగిన సంభాషణంతా విన్నది. పార్వతికి తన మనస్సును కప్పిన తెరలేవో తొలగిపోతున్నట్టనిపించింది. ఇన్నాళ్ళూ తనకు తెలుసుననుకున్న సత్యం వట్టి భ్రమ మాత్రమే అని ఈనాడు ఎవరో తనకు చెపుతున్నట్టుంది. వైవాహిక జీవితాన్ని ఇంతకాలం ఏవగించుకుంది తను. కాని ఒడిదుడుకులున్నంత మాత్రాన దాంపత్య జీవితం సుఖప్రదం కాకుండా పోనక్కరలేదని ఈనాడు తెలుసుకుంది. పూర్తిగా పాలకోవాలాంటిది కాకపోయినా అంతకంటే ఏదో కమ్మదనం వుందనిపించే ఉగాదిపచ్చడి వంటిది దాంపత్య జీవితం అన్నది ఎందుకు నిజం కాకూడదు.

ఇతరులకోసం జీవిస్తున్నాననుకుంటున్నంతకాలం మనిషి తన జీవితాన్నిగురించి ఆలోచించడు. కాని ఆ ఇతరుల దృష్టిలో తనకు విలువలేదని గుర్తించినప్పుడు అర్థం లేని ఆదర్శంకోసం వ్యర్థంచేసిన జీవితం లోని వెలితి కొట్టొచ్చినట్టు కనుపిస్తుంది. ఈ పరిస్థితిలోనే ఇంతకాలం తరువాత వివాహాన్నిగురించి ఆలోచిస్తున్నది పార్వతి. వివాహం తలపెట్టక, కనిపెంచిన తల్లి దండ్రులనూ, తమ్మణ్ణీ ఆదుకోవడం తన కర్తవ్యంగా భావించి యవ్వనాన్నీ, సుఖాన్నీ వదులుకుని ఇంతకాలం వీళ్ళను పోషిస్తూ వచ్చింది. కాని ఈనాడు...వీళ్ళుచూపించిన ఆత్మీయత ఏమిటి? తన వ్యక్తిత్వానికి వీళ్ళిచ్చిన విలువ ఏపాటిది? పాటిమనిషికి సహాయపడినందుకు ఒక్కరోజు జీతం తీసుకు రాలేక పోయినందుకు పురుగును చూచి నట్టు ఏహ్యంతో చూచింది ఈ ఆత్మీయులే.

తన డబ్బును ఒక మంచి కార్యానికై వినియోగించడానికికూడ హక్కులేదా తనకు? ఎందుకోసం తను శ్రమించి వుద్యోగం చెయ్యాలి? యంత్రంలా బ్రతకాలి? ఇంతకాలం తను విలువనిచ్చి గౌరవించిన ఆత్మీయతనూ, మమకారాన్నీ ఈనాడు తనవాళ్ళే గాయపరిచారు. సుఖాన్ని త్యజించి తనవాళ్ళకై చేసిన సేవకు విలువలేకుండా పోయిందీనాడు. రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది తన జీవితం. తను యవ్వనానికి దూరమయ్యే రోజులు దగ్గర పడుతున్నాయి. త్యాగమనే పేరుతో తన జీవితాన్ని వ్యర్థం చేసుకోవడం అవివేకమన్న సత్యాన్ని ఆలస్యంగానైనా తెలుసుకోగలిగింది తను. ఇకనైనా తెరలు తొలగించుకుని తన దారేదో తను చూసుకోవాలి. పార్వతికి కృష్ణమూర్తి మనసులో మెదిలాడు. ఆఫీసులో తనతోబాటు పనిచేసే కృష్ణమూర్తికి తనను వివాహం చేసుకోవాలనే అభిప్రాయం వున్నట్టు తనకు చాలాకాలంగా తెలుసు. అతడే స్వయంగా తనతో ఆ విషయం ప్రస్తావించాడు కూడా. కాని అప్పుడు తమ్ముడు చదువు పూర్తిచేసి వుద్యోగంలో స్థిరపడేదాకా తాను పెళ్ళివిషయమే తల పెట్టదలచుకోలేదని నిక్కచ్చిగా చెప్పి వేసింది. పాపం కృష్ణమూర్తి చిన్న బుచ్చుకుని మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

తనిప్పుడు కృష్ణమూర్తిని వివాహం చేసుకుంటే? తల బరువెక్కి ఆపైన ఆలోచించలేక పోయింది పార్వతి.

ఎవ్వరికీ చెప్పకుండా కృష్ణమూర్తీ, తనూ రిజిష్టరు మేరేజి చేసేసుకున్నారు. తలిదండ్రుల ఆశీర్వాదం పొందాలని పతీ సమేతంగా తిరిగొచ్చిన పార్వతికి తమ ఇంటిముందు జనం గుమిగూడి వుండటం కనిపించింది. ఏదోభయం ఆమెనావహించింది. ఆందోళనతో జనాన్ని తోసుకుంటూ ఇంట్లోకి ప్రవేశించిన పార్వతి వసారాలో



కనిపించిన దృశ్యాన్ని చూసి స్తంభించి పోయింది. తలిదండ్రుల మృతదేహాలమీద పడి గుండెలు పగిలేలా రోదిస్తున్నాడు తమ్ముడు.

‘ఇదే......ఆ ముసలాళ్లను పొట్టన బెట్టుకుంది......హంతకి......రాక్షసి.....’ గుంపులోంచి ఎవరో కేకలు పెడుతూ తన పైపైకి వస్తున్నారు ... త్రుళ్లిపడి లేచింది పార్వతి. లైటింకా వెలుగుతూనే వుంది. చెమటతో తడిసి గజగజ వణికిపోతున్నది ఆమె శరీరం. గొంతు పిడచకట్టుకు పోయినట్లనిపించింది. అతికష్టంమీద మంచం దిగింది. కాళ్లూచేతులూ ఆమె స్వాధీనంలో లేనట్లు తూలుతూ వెళ్లి కూజాలో మంచినీళ్లు వంపుకుని రెండు గ్లాసులు గడగడ తాగేసి తడబడుతూ వచ్చి లైటార్పి మంచంమీద పడిపోయింది పార్వతి. తల పోటుతో పేలిపోతున్నది. ‘అమ్మా!’ అంటూ భారంగా కళ్లు మూసుకుంది.

* * *

ఆ రాత్రి మూసినకళ్లను మళ్లా వారం రోజులకు గాని తెరవలేకపోయింది పార్వతి. సిరెంజిలోకి మందు నెక్కిస్తూ మసక మసగ్గా డాక్టరు కనిపించాడు. కళ్లు మరి కొంచెం పెద్దవిచేసి స్పష్టంగా చూడ్డానికి ప్రయత్నించి మెల్లగా తల పక్కకు తిప్పింది. తన మంచాన్నామకుని ...కమల!...అవును. అదే కృతజ్ఞతా భావంతో నిండిన సజల నేత్రాలతో తన వేపు చూస్తూ నిలబడివున్నట్లనిపించింది. కమల చేతిని తాకుతూ బలహీనంగా నవ్వింది పార్వతి. డాక్టరు ఇంజక్షనిచ్చాడు. తండ్రి డాక్టరునేదో అడుగుతున్నాడు.

‘కంగారు పడకండి. మీ అమ్మాయికి ఇహనేం ప్రమాదంలేదు. ఇది ‘ఫ్లూ’ జ్వరం లాంటిది—త్వరలోనే తగ్గిపోతుంది’ అని డాక్టరు వెళ్లిపోయాడు. తండ్రిముఖం సంతోషంతో విప్పారింది.

‘అమ్మా! అక్కయ్యకి మరేం ఫరవాలే దన్నాడే డాక్టరు’ అంటూ ఆనందంతో తల్లి గదిలోకి పరుగెత్తాడు తమ్ముడు.

పార్వతి పెదవులమీద పేలవమైన చిరు నవ్వు పూచింది. తను దక్కినందుకా లేక తన సంపాదన దక్కినందుకా వాళ్ల సంతోషం? అర్థం కాలేదు పార్వతికి. తన చేతిని మృదువుగా రాస్తూ కూర్చున్న కమలవేపు ప్రేమగా చూచింది.

ఆత్మీయత అన్నది కేవలం రక్తసంబంధానికే పరిమితం కావక్కరలేదు. రక్తం పంచుకుని పుట్టనివాళ్లు ఆత్మీయులు ఎందుకు కాకూడదు? పార్వతి నేత్రాలు జలపూరితాలయినయ్. ఆనందాశ్రువులో దుఃఖాశ్రువులో అంతు తెలియని ఆ కన్నీటి తెరలలోంచి తనకోసం వేచివుండే కృష్ణమూర్తి నిర్మల స్వరూపం గోచరించింది పార్వతికి.

‘కమలా’ అన్నది మృదువుగా పార్వతి. ‘మీ అన్నయ్యకు...’

‘అంతా నీ చలవే పార్వతీ! నీ దగ్గర నుండి డబ్బు తీసికెళ్లిన మర్నాడే అన్నయ్య వుద్యోగంలో చేరాడు. నీకు మరో శుభవార్త కూడ చెప్పబోతున్నాను.’

కమల మెరిసే కళ్లలోకి ఏమిటన్నట్లు చూచింది పార్వతి.

‘నాకు పెళ్లి కాబోతుంది’ కమల బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కినయ్.

‘అలాగా! సంతోషం. కాబోయే శ్రీవారు ...?’ పార్వతి హీనస్వరం సంతోషంతో ఒకింత శక్తిని పుంజుకుంది.

‘వారిని నువ్వు ఎరుగుదువు పార్వతి. మీ ఆఫీసులోనే పని చేస్తున్నారు. పేరు కృష్ణమూర్తి. ఆయన...’ ఆపైన విన లేకపోయింది పార్వతి. ఆమె కళ్లను చీకటి తెరలు కప్పివేసినయి.

డాక్టర్ కబుర్లు

## ధాలిడోమయిడ్ ప్రమాదం

కొంతకాలం క్రితం ఎందరో గర్భంతో ఉన్న స్త్రీలు ‘ధాలిడోమయిడ్’ అనే మందు ‘సెడేటివ్’గా తినటంవల్ల వారి పిల్లలు ఎన్నో లోపాలతో పుట్టారు—చేతులూ, కాళ్లూ కూడా



లేకుండా. ధాలిడోమయిడ్‌ని నిషేధించారు. కాని, అదే పేరుతో కాక ఇతర పేర్లతో ఆ మందు వాడకంలో ఉంది. ఇది అందరు వనితలూ గుర్తించతగ్గ ప్రమాదం.

ధాలిడోమయిడ్ ఒక పేటంట్ మందుపేరు. ఇదే మందుకి కాంటరగ్జన్, డిస్టవాల్, సాఫ్టెనాన్, వెర్టిల్, అయిసోమెన్, సెడాలిస్, సెడాటమ్, బాన్ బ్రెయిన్, న్యూరోడయిన్ అనే పేర్లు కూడా ఉన్నాయి.

గర్భంతో ఉన్న వనితలు ఈ మందులు పుచ్చుకోకుండా జాగ్రత్తపడాలి.

గర్భం ధరించే సమయంలో ఏ రకం ‘సెడేటివ్’ పుచ్చుకున్నా అందులో ధాలిడోమయిడ్ లేదని డాక్టరుని అడిగి తెలుసుకోవాలి.

హెచ్. ఎల్. హెర్షెన్‌సోన్
(కాపీరయిటు)